ప్రజాశక్తి
శనివారం 14 డిసెంబరు 2024

16న ఎస్‌సి ఉప వర్గీకరణ కమిషన్ పర్యటన

శ్రీకాకుళం అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం నియమించిన షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణ కమిషన్ చైర్మన్, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా ఈనెల 16న జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. కమిషన్ చైర్మన్ ఆరోజు ఉదయం పది గంటలకు జిల్లాకు చేరుకొని, 11 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశమవుతారని పేర్కొన్నారు. అనంతరం దళిత ఉద్యోగులు, దళిత సంఘాల నాయకులు, ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని తెలిపారు. షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణపై అభిప్రాయాలు, సూచనలు తెలియజేయాలనుకునే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు సాగునీటి సమరం

- **347 సంఘాలకు ఎన్నికలు**
- **4.20 లక్షల మంది ఓటు హక్కు వినియోగించుకోనున్న ఓటర్లు**
- **ఉదయం ప్రాదేశిక నియోజకవర్గాల సభ్యుల ఎన్నిక**
- **మధ్యాహ్నం అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక**

సాగునీటి సంఘాలకు శనివారం ఎన్నికలు జరుగనున్నాయి. జిల్లావ్యాప్తంగా ఉన్న 347 నీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికల నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రెవెన్యూ, జలవనరుల శాఖకు చెందిన అధికారులను ఎన్నికల అధికారులుగా నియమించారు. ఎన్నికలు జరిగే ప్రాంతాలు, వేదికలపై ఇప్పటికే ఆయా సంఘాల పరిధిలోని ఓటర్లకు సమాచారం ఇచ్చారు. నిర్ణయించిన కేంద్రాల్లో ఉదయం ఎనిమిది గంటలకు ఎన్నిక నిర్వహించనున్నారు. తొలుత ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులను (టిసి), రెండో పూట అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకోనున్నారు. సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

సాగునీటి సంఘాలకు సాఫీగా ఎన్నికలు నిర్వహించేలా అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలోని 347 నీటి వినియోగదారుల సంఘాల పరిధిలోని 2,667 ప్రాదేశిక నియోజకవర్గాలు (టిసి)కు ఎన్నికలు నిర్వహించనున్నారు. జిల్లాలో 4.20 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 3.19 లక్షల మంది పురుష ఓటర్లు, 1.11 లక్షల మంది మహిళా ఓటర్లు ఉన్నారు. బూర్జ మండలం గుత్తావల్లి, కర్లకోట-1, కర్లకోట-2, తొగరాం సంఘాలు ఉన్నాయి. ఆమదాలవలసలో కొర్లకోట, దూసి, పొందూరు మండలం తాడివలస, పొన్నాం, పెనుబర్తి, కింతలి, బొడ్డేపల్లి, ఎచ్చెర్ల మండలంలో దుప్పలవలస, పూడివలస, పొన్నాడ, కొంగరాం, ధర్మవరం, కొత్తపేట, గార మండలం వాడాడ, శ్రీకూర్మం, అంపోలు, అంపోలు-2, శ్రీకాకుళం మండలంలో కళ్లేపల్లి, సింగుపురం, గూడెం, అరసవల్లి, బలగ రూరల్, జలుమూరు మండలం జలుమూరు, గుండువలస, నగరికటకం, కొమ్మనాపల్లి, తిమ్మడాం, గొటివాడ, నరసన్నపేట మండలం నడగాం, లుకలాం, ఉర్లాం, సత్యవరం, కోమర్తి, కిల్లాం, పోలాకి మండలం పోలాకి, ఈదులవలస, ఉర్జాం, మబగాం, యతియాబాసివలస, సంతబొమ్మాళి మండలం సంతబొమ్మాళి, గోవిందపురం, తాళ్లవలస, కోటబొమ్మాళి మండలం ఎలమంచిలి, గంగారం, నిమ్మాడ, హరిశ్చంద్రపురం, సంతబొమ్మాళి మండలం దండులక్ష్మీపురం, ఉమ్మిలాడ, రుంకు, మేఘవరం, డిజి పురం, హెచ్‌ఎన్‌పేట, హిరమండలం అంబావల్లి, టెక్కలి మండలం తిర్లంగి, రావివలస, బన్నువాడ, నందిగాం మండలం బూరగాం, వీరభద్రాపురం, పలాస మండలం లక్ష్మీపురం, అంతరకుడ్డ, సరుబుజ్జిలి మండలం సరుబుజ్జిలి, రొట్టవలస, యరగాం, పురుషోత్తపురం, ఎల్‌ఎన్‌పేట మండలం ఎల్‌ఎన్‌పేట, తెలికిపెంట సంఘాలు ఉన్నాయి.

పోలాకి : ఈదువలస పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్ సురేష్ కుమార్

ఎన్నిక ప్రక్రియ సాగేదిలా...

ఓటర్లు అయిన రైతులంతా కలిసి వాటర్ యూజర్స్ అసోసియేషన్ (డబ్ల్యుయుఎ) ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులను ఎన్నుకుంటారు. సభ్యులను ఎన్నుకునేందుకు మూడు పద్ధతులను అనుసరించనున్నారు. సభ్యుల ఏకగ్రీవానికి అంగీకారం తీసుకుంటారు. ఏకగ్రీవం కాని పక్షంలో చేతులెత్తే పద్ధతిని అనుసరిస్తారు. ఏ అభ్యర్థికైతే మెజార్టీ సభ్యులు అంగీకారం తెలుపుతారో, వారు ఎన్నికైనట్లు ప్రకటిస్తారు. ఈ సందర్భంగా ఇద్దరికీ సమాన ఓట్లు వస్తే రహస్య పద్ధతిలో ఓటింగ్ నిర్వహించనున్నారు. ప్రాదేశిక నియోజకవర్గ సభ్యుల ఎన్నిక పూర్తయిన తర్వాత మధ్యాహ్నం పూట అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక నిర్వహించనున్నారు. ప్రతి కమిటీ నుంచి ఎన్నికైన సభ్యులంతా అందులో ఇద్దరిని అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎన్నుకుంటారు.

పోటీ కోసం తహతహ

ప్రభుత్వం అధికారంలో ఉండడంతో కూటమి పార్టీలైన టిడిపి, జనసేన, బిజెపి నాయకులు సాగునీటి సంఘాల పదవులపై ఆసక్తి కనబరుస్తున్నారు. 2014-19 కాలంలో జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికల్లో కేవలం టిడిపి సానుభూతిపరులు మాత్రమే దక్కించుకోగా... ఇప్పుడు జనసేన, బిజెపి కూడా అందులో భాగస్వామ్యం కావాలని కోరుకుంటున్నాయి సాగునీటి సంఘాలకు రాజకీయ పార్టీలతో సంబంధం లేకపోయినా పదవులు దక్కించుకునేందుకు కూటమి నాయకులు పోటాపోటీ పయత్నాలు సాగిస్తున్నారు. మరోవైపు వైసిపి నాయకులూ పోటీకి దిగేందుకు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వం అధికారంలో ఉండడంతో పదవులు వస్తే ప్రాధాన్యం ఉంటుందని భావిస్తున్న నాయకులు అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవుల కోసం పోటీ పడుతున్నారు. ఆయా నియోజకవర్గాల్లోని ఏయే సంఘాలకు ఎవరెవరు అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఉండాలో మండల పార్టీ నాయకులకు ఎమ్మెల్యేలు సూచించినట్లు తెలిసింది.

ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

కార్మికుల మస్టర్ల పాయింట్లు తగ్గించాలి

కార్పొరేషన్ వద్ద మున్సిపల్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు పెంచిన మస్టర్ పాయింట్లను తగ్గించాలని, అధికారుల వేధింపులు ఆపాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షులు ఎ.గణేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం డిమాండ్ చేశారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ సుధీర్‌ను కలిసి సమస్యను వివరించారు. సమస్య పరిష్కారానికి ఆయన చొరవ చూపకపోవడంతో, నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద కార్మికులు శుక్రవారం విధులు బహిష్కరించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఉన్న మూడు మస్టర్ పాయింట్ల స్థానంలో ఐదు మస్టర్ పాయింట్లుగా పెంచడం వల్ల కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరినా అధికారులు పట్టించుకోకుండా వేధించడం తగదన్నారు. మస్టర్ పాయింట్ల స్థానంలో కొత్తగా రెండు ఏర్పాటు చేయడం వల్ల ఉదయం విధులకు హాజరు కావడానికి ఆటోల్లేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.

రోజుకు రూ.50 ఆటో ఛార్జీలకే వెచ్చించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు పనులు చేపట్టేందుకు అవసరమైన పనిముట్లు పూర్తిస్థాయిలో ఇవ్వకుండా పనిచేయాలని వేధించడం తగదన్నారు. క్లాప్ వెహికల్స్ ద్వారా ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్త ఒక్కో ఇంటి నుంచి కేజీకి తక్కువ కాకుండా కార్మికులు తీసుకుని రావాలని, లేకపోతే ఆబ్సెంట్ వేస్తామని అధికారులు బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు తమ వైఖరి మార్చుకుని కార్మికుల సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నగర కమిటీ నాయకులు కళ్యాణ రాజు, ఆకుల శంకరరావు, డి.చిట్టి, ఎ.రాము, డి.యుగంధర్, ఎ.శేఖర్, ఎ.జనార్ధన్, ఎ.గురుస్వామి, జె.మాధవి, ఎ.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

శ్రీకాకుళం లీగల్ : జాతీయ లోక్ అదాలత్‌ను శనివారం జిల్లాలో నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. జిల్లా కోర్టులో ఏర్పాటు చేసిన బెంచ్‌లను శుక్రవారం పరిశీలించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని పరిష్కరించుకోదగ్గ కేసులను రాజీ చేసుకోవాలని సూచించారు. లోక్ అదాలత్ నిర్వహణకు జిల్లాలో 19 బెంచ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాజీ పడదగ్గ క్రిమినల్, సివిల్ కేసులు పరిష్కరించనున్నట్లు చెప్పారు. లీగల్ సర్వీసులను ప్రజల వద్దకు చేరేలా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్స్, పారాలీగల్ వాలంటీర్లు పనిచేయాలని సూచించారు. లోక్ అదాలత్‌లో కేసు రాజీ అయితే ఇరు పక్షాలకూ గెలుపే ఉంటుందన్నారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ చేసుకుని కొత్త జీవితం ప్రారంభించడానికి ఇదో మార్గమన్నారు.

రైతులను దగా చేస్తున్న ప్రభుత్వం

వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రైతులను ఉద్ధరిస్తామని కల్లబొల్లి కబుర్లు చెప్పిన టిడిపి కూటమి ప్రభుత్వం, అధికారంలోకొచ్చాక వారిని దగా చేస్తోందని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు విమర్శించారు. వైసిపి రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా కలెక్టరేట్ వద్ద శుక్రవారం ధర్నా చేపట్టారు. నగరంలోని 80 అడుగుల రోడ్డు నుంచి కలెక్టరేట్ వరకు ఎడ్ల బండి మీద ర్యాలీగా ఆ పార్టీ నాయకులు కలెక్టరేట్ వరకు వచ్చారు. దారిపొడవునా ప్లకార్డులు ప్రదర్శిస్తూ రైతులకు మద్దతుగా నినాదాలు చేశారు. అనంతరం అక్కడ చేపట్టిన ధర్నానుద్దేశించి కృష్ణదాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం దళారీ వ్యవస్థను ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. రైతులకు ప్రభుత్వం చెల్లించాల్సిన గిట్టుబాటు ధర అందకుండా చేస్తోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో మిల్లర్లను కాదని రైతులు నేరుగా ధాన్యం విక్రయించుకునేందుకు రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేస్తే, వాటిని కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. దీంతో ఇప్పుడు రైతులు వ్యయ ప్రయాసలకోర్చి మిల్లర్ల చుట్టూ తిరగాల్సి వస్తోందన్నారు. చేతికొచ్చిన పంట ఎప్పుడు కొంటారో తెలియని పరిస్థితి క్షేత్రస్థాయిలో ఉందన్నారు. మరోవైపు ప్రకృతి వైపరీత్యాల కారణంగా ముందస్తు వరి కోతలు చేపట్టిన రైతులు, ధాన్యం ఎండబెట్టేందుకు పంట పొలాల్లో పండించిన ధాన్యానికి కాపలా కాయాల్సి వస్తోందన్నారు. తడిసిన ధాన్యం కొనే పరిస్థితి లేక రైతులు అవస్థలు పడుతున్నారని చెప్పారు. రైతులకు గతంలో రైతుభరోసా కింద పెట్టుబడి సాయం అందేదని, కూటమి ప్రభుత్వం దాన్ని అందించకుండా ముఖం చాటేసిందని విమర్శించారు. తక్షణమే పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు ప్రతి రైతుకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యేలు రెడ్డి శాంతి, గొర్లె కిరణ్‌కుమార్, నాయకులు పేరాడ తిలక్, చింతాడ రవికుమార్, ఎ.శ్రీనివాసరావు, గొండు రఘురాం, పీస గోపి, ఎం.వి పద్మావతి, దుంపల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఎడ్ల బండిపై ర్యాలీగా వస్తున్న వైసిపి నాయకులు

ధాన్యం కొనుగోలు వేగవంతం

జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి - ఆమదాలవలస

రైతులకు మద్దతు ధరను అందించేందుకే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. మండలంలోని శ్రీనివాసాచార్యులపేట రైతు సేవా కేంద్రంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు. ధాన్యం కొనుగోలు సేకరణకు సంబంధించిన రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేపట్టి మద్దతు ధర దక్కేలా చూడాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లర్లకు వెళ్లే ట్రక్ షీట్లను సకాలంలో పూర్తి చేసి అందించాలని సూచించారు. తేమ శాతం పేరుతో రైతులను మిల్లర్లు ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లపై గ్రామాలలో విస్తృతంగా ప్రచారం చేసి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి బి.నాగరాజు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

నకిలీ నోట్ల ముఠా గుట్టురట్టు

- **రూ.57.40 లక్షల నకిలీ కరెన్సీ స్వాధీనం**
- **మెళియాపుట్టిలో ఆరుగురు, జి.సిగడాంలో ఇద్దరు అరెస్టు**

ప్రజాశక్తి - మెళియాపుట్టి, జి.సిగడాం

నకిలీ నోట్లను ముద్రిస్తూ చెలామణి చేస్తున్న ముఠా గుట్టును పోలీసులు శుక్రవారం రెండు చోట్ల రట్టు చేశారు. మెళియాపుట్టిలో ఆరుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.57.25 లక్షలు, జి.సిగడాంలో రూ.15 లక్షల నకిలీ కరెన్సీని స్వాధీనం చేసుకొని, ఇద్దరిని అరెస్టు చేశారు. మెళియాపుట్టి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టెక్కలి డిఎస్‌పి డి.ఎస్.ఆర్.వి.ఎస్.ఎన్ మూర్తి ఆ మండలంలో ఘటనా వివరాలను వెల్లడించారు. పట్టుపురం కూడలి వద్ద ఓ ఇంట్లో నకిలీ నోట్లు ముద్రిస్తున్నారన్న సమాచారం మేరకు ఆ ఇంటిపై పోలీసులు దాడి చేశారని చెప్పారు. ఆ సమయంలో నకిలీ కరెన్సీని గుర్తించామన్నారు. మండలంలోని సంతలక్ష్మీపురానికి చెందిన తమ్మిరెడ్డి ఢిల్లీరావు, దాసరి కుమారస్వామి, కరజాడకు చెందిన దాసరి రవికుమార్ పలాస మండలం నర్సిపురానికి చెందిన తమ్మిరెడ్డి రవి, అదే మండలంలోని పెదంచలకు చెందిన కుసిరెడ్డి దూర్వాసులు, వజ్రపుకొత్తూరు మండలం డోకులపాడుకు చెందిన దుమ్ము ధర్మారావును అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరి నుంచి రూ.57.25 లక్షల విలువైన నకిలీ రూ.500 నోట్లు, నకిలీ నోట్ల తయారీకి వినియోగిస్తున్న కలర్ జిరాక్స్ మిషన్, ప్రింటర్, కలర్స్ స్కేల్, పేపర్ కటింగ్ బ్లేడ్, గమ్ బాటిల్, స్కూటీ, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులు రూ.ఐదు లక్షల అసలు కరెన్సీ నోట్లకు బదులుగా రూ.25 లక్షల నకిలీ కరెన్సీ నోట్లను ఇస్తామని ఎర చూపుతున్నారని తెలిపారు. ఒడిశా నుంచి నకిలీ నోట్లు తెచ్చి వాటిని కలర్ జిరాక్స్ మిషన్‌లో జిరాక్స్ తీసి ఇస్తున్నారని వివరించారు. నిందితుల్లో కొందరిపై గతంలోనూ పలు పోలీస్‌స్టేషన్లలో వేర్వేరు కేసులు నమోదై ఉన్నాయని చెప్పారు. ఈ కేసుకి సంబంధించి మరికొంతమందిని అరెస్టు చేయాల్సి ఉందన్నారు. నిందితులను అరెస్టు చేయడం, నకిలీ నోట్లు, వాటి ముద్రణకు ఉపయోగించే పరికరాలను స్వాధీనం చేసుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన పాతపట్నం సిఐ వి.రామారావు, ఎస్ఐ రమేష్‌బాబు, ఇతర పోలీస్ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

వివరాలను వెల్లడిస్తున్న సిఐ అవతారాం

వివరాలను వెల్లడిస్తున్న డిఎస్‌పి మూర్తి, స్వాధీనం చేసుకున్న నకిలీ నోట్లు

జి.సిగడాంలో ఇద్దరు అరెస్టు

ఎచ్చెర్ల మండలంలోని కొత్తదిబ్బలపాలెం గణగళ్ల రవి, ఎచ్చెర్ల మండలం యాతపేటకు చెందిన ఎన్ని రాజేష్ రణస్థలం నుంచి రాజాం వైపు వెళ్తున్న మార్గంలో పెనసాం వద్ద రూ.15 లక్షల నకిలీ రూ.500 నోట్లతో పోలీసులకు పట్టుబడ్డారు. వారి నుంచి రెండు సెల్‌ఫోన్లతో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. విలేకరిగా పనిచేస్తున్న రాజేష్‌కు రవితో పరియం ఏర్పడింది. వారికి రాపాక ప్రభాకర్ అలియాస్ ప్రతాప్‌రెడ్డి, కృష్ణమూర్తితో పరిచయమైంది. రవి, రాజేష్ తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలం వెళ్లి నకిలీ నోట్ల తయారీకి ఉపయోగించే రసాయనాలు కొన్నారు. కృష్ణమూర్తికి రూ.ఐదు లక్షలు ఇవ్వగా, అతను రూ.15 లక్షల నకిలీ నోట్లు ఇచ్చాడు. వాటిని సాలూరు, ఒడిశాలో చెలామణి చేసేందుకు వెళ్తున్న సమయంలో పోలీసులు పట్టుకున్నారు. వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. ఈ వ్యవహారంలో పాత్ర ఉన్న ప్రతాప్‌రెడ్డి, కృష్ణమూర్తి, మరికొందరిని అరెస్టు చేయాల్సి ఉందని జె.ఆర్ పురం సిఐ అవతారాం, ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు.

స్వదేశానికి చేరుకోనున్న సిక్కోలు మత్స్యకారులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

అనుకోకుండా శ్రీలంక సముద్ర జలాల్లోకి ప్రవేశించి, ఆరు నెలలుగా అక్కడి జైల్లో మగ్గుతున్న జిల్లాకు చెందిన మత్స్యకారులు తిరిగి స్వదేశానికి చేరుకున్నారు. ఈమేరకు శ్రీలంకలోని భారత ఎంబసీ కార్యాలయం నుంచి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కార్యాలయానికి శుక్రవారం సమాచారం అందించారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం రూరల్ మండలం పెద్ద గణగళ్లవానిపేటకు చెందిన మత్స్యకార యువకులు దాసరి వెంకయ్య(35), గనగళ్ల కొర్లయ్య (33) ఉపాధి నిమిత్తం జూన్ ఏడో తేదీన చెన్నైకి వలస వెళ్లారు. అక్కడ్నుంచి జూన్ 25న మొత్తం ఎనిమిది మంది కలిసి, బోటులో సముద్రంలోకి వేటకు వెళ్లారు. సరిహద్దులు తెలియక శ్రీలంక సముద్ర జలాల్లోకి ప్రవేశించడం, ప్రమాదవశాత్తు మరో బోటును ఢీకొట్టడంతో అక్కడి కోస్టుగార్డు పోలీసులు అరెస్టు చేశారు. దీనిపై 15 రోజుల తర్వాత కర్ణాటకకు చెందిన మత్స్యకార సంఘానికి విషయం తెలియగా.. వారు బాధిత కుటుంబాలకు సమాచారం అందించారు. దీంతో స్థానిక నాయకులు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తదితరులు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు.



దాసరి వెంకయ్య

గనగళ్ల కొర్లయ్య

జిల్లాకు చెందిన ఇద్దరు మత్స్యకారులు అనుకోకుండా శ్రీలంక కోస్టుగార్డుకు చిక్కుకోవడంతో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్ వెంటనే స్పందించారు. బాధిత కుటుంబాలకు బియ్యం, రేషన్ సరుకులు అందజేశారు. విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్‌ను కలిసి, మత్స్యకారులను స్వదేశానికి చేరుకునేలా చొరవ చూపాలని కోరారు. భారత ఎంబసీకి సమాచారం అందించారు. ఈమేరకు జరిగిన సంప్రదింపులు కొలిక్కి రావడంతో.. గంగపుత్రులను విడుదల చేసేందుకు ప్రభుత్వం అంగీకరించింది. కోర్టులో న్యాయ ప్రక్రియ పూర్తయిన కొద్దిరోజుల్లోనే మత్స్యకారులను ముందుగా కొలంబోకు, అక్కడి నుంచి విమానంలో స్వదేశానికి చేర్చనున్నట్లు సమాచారం అందించారు. దీనిపై బాధిత కుటుంబసభ్యులు, పెద్దగణగళ్లవానిపేట నాయకులు ఆనందం వ్యక్తం చేశారు.

పాల సేకరణ ధరను పెంచాలి

ప్రజాశక్తి - రణస్థలం

విశాఖ డెయిరీ తగ్గించిన ఆవు పాల సేకరణ ధరను పెంచాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, రైతు సంఘం నాయకులు వెలమల రమణ డిమాండ్ చేశారు. మండలంలోని ముక్తుంపురంలో పాల రైతుసంఘం ఆధ్వర్యాన పాడి రైతులు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ డెయిరీ ఆవు పాల సేకరణ ధర లీటరుకు రూ.నాలుగు వరకు తగ్గించడం వల్ల పాడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. పశువులకు వైద్య, దాణా ఖర్చులు పెరిగిపోయి పాలు ధర గిట్టుబాటు కావడం లేదన్నారు. ఈ తరుణంలో ధర పెంచాల్సింది పోయి తగ్గించడం అన్యాయమన్నారు. రైతుల శ్రమతో అభివృద్ధి చెందిన డెయిరీకి రూ.వేల కోట్ల ఆస్తులు సమకూరినా, మార్కెట్‌లో మంచి బ్రాండ్ ఇమేజ్ వచ్చినా... అభివృద్ధిలో వచ్చిన ఫలాలు రైతులకు దక్కకుండా దారిమళ్లిస్తోందని విమర్శించారు. ఆవు పాలు 3.5 శాతం వెన్నకు రైతుకు రూ.34 చెల్లిస్తున్నారని, అవే పాలు మార్కెట్‌లో వెన్న శాతం తగ్గించి రూ.54కు అమ్ముతున్నారని తెలిపారు. 5.5 శాతం వెన్నకి రూ.38 రైతుకు చెల్లిస్తూ అవే పాలు రూ.64కు విక్రయిస్తోందన్నారు. కొనుగోలు, అమ్మకం ధరకు వ్యత్యాసం లీటరుకు రూ.24 వరకు ఉందన్నారు. నిర్వహణ ఖర్చు లీటరుకు రూ.10 తీసేసినా, రూ.14 మిగులుతుందన్నారు. అందులో రూ.10 రైతుకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డెయిరీలో అవినీతిపై విచారణ చేసి నిందితులను శిక్షించాలన్నారు. డెయిరీ ఆస్తులను కాపాడడంతో పాటు సహకార చట్టం పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఆవు పాల సేకరణ ధర పెంచాలని కోరుతూ ఈనెల 16న శ్రీకాకుళంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో నిర్వహించే సదస్సును జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కె.అప్పలనాయుడు, కలిశెట్టి సన్యాసప్పలనాయుడు, సిహెచ్.పాపయ్య, టి.పైడిరాజు, సూరమ్మ, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న పాల రైతులు

పేరు మార్చడమైనది

ఇంటిపేరు మరియు పేరు మార్చడం అయినది **మూల అనురాధ,** W/o పైడి కుమారుస్వామితో కొన్నేళ్ల క్రితం వివాహమైనది. మూల **అనురాధ పేరు** మీద ఆముదాలవలస మండలం వంజంగి గ్రామం పోస్ట్ ఆఫీస్ లో **RPLI Policy No.R-AP-EA-367482** కలదు.

పైడి పూర్ణ చంద్రావతి, W/o పైడి కుమార స్వామి గా పేరు మార్చడమైనది. ఇక నుండి బ్యాంకు లావాదేవీలు పోస్టల్ ఇతరతర ఆస్తి వ్యవహారాలకు ఈ పేరును వినియోగించు కుంటున్నామని పత్రిక ముఖముగా తెలియజేస్తున్నాము.

ఇట్లు
పైడి పూర్ణ చంద్రావతి
W/o పైడి కుమారస్వామి,
ఫరీదు పేట పోస్ట్, రామదాసుపురం గ్రామం,
పొందూరు మండలం, శ్రీకాకుళం జిల్లా.

కూరగాయలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

నాసిరకం ఆహారంపై ఎమ్మెల్యే ఆగ్రహం

ప్రజాశక్తి- కొత్తూరు

కస్తూరిబా గాంధీ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న నాసిరకం ఆహారంపై పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని వసపలో ఉన్న ఉన్నత పాఠశాలను ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటశాలను పరిశీలించి ఆహారపదార్థాలు ఉండడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే సిబ్బంది సమయపాలన పాటించడం లేదని, నాసిరకం కూరగాయలను సరఫరాపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఫోన్‌లో ఆదేశించారు. విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. చుట్టుపక్కల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థుల రిజిస్టరు, సిబ్బంది అటెండెన్స్‌ను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈయనతో పిఒ రాధ, సిబ్బంది ఉన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

సమస్యల పరిష్కారానికి వినతి

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని ఏకోపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు పరిష్కరించాలని యుటిఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు మండల ఎంఇఒ ధనుంజయ మజ్జికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలోని ఏకోపాధ్యాయులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ఏకోపాధ్యాయ జీతాలు, సర్వీస్ సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు లండ బాబూరావు, జిల్లా కార్యదర్శి మురళీ ప్రకాష్, యుటిఎఫ్ జిల్లా సిపిఎస్ కన్వీనర్ జానకిరావు, కవిటి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగదీష్, సీతానాయుడు, సీనియర్ నాయకులు రవికుమార్, సూర్యం, ధనుంజయరావు, నరేష్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

అభినందిస్తున్న ఎంఇఒ ధనుంజయ మజ్జి

ఉపాధ్యాయులకు అభినందనలు

ప్రజాశక్తి- కవిటి

యుటిఎఫ్ 50 సంవత్సరాల స్వర్ణోత్సవ సంబరాల సందర్భంగా ఇటీవల రాష్ట్ర స్థాయిలో జరిగిన క్రికెట్ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా ద్వితీయ స్థానం సాధించింది. ఆ జట్టులో సభ్యులైన కవిటి మండలం ఉపాధ్యాయులు సింహాచలం, సందీప్, నరేష్‌లను ఎంఇఒ ధనుంజయ మజ్జి, మండల యుటిఎఫ్ టీం శుక్రవారం అభినందించింది. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు లండ బాబూరావు, జిల్లా కార్యదర్శి మురళి ప్రకాష్, యుటిఎఫ్ జిల్లా సిపిఎస్ కన్వీనర్ జానకిరావు, కవిటి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగదీష్, సీతానాయుడు, సీనియర్ నాయకులు రవికుమార్, సూర్యం, ధనుంజయరావు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఇఒ పద్మనాభరావు

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మెనూ ప్రకారం భోజనం పెట్టాలని నోడల్ అధికారి, ఎంఇఒ-2 మల్లిరెడ్డి పద్మనాభరావు అన్నారు. శుక్రవారం పెద్దమడి రెసిడెన్షియల్ పాఠశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో ఆయన మాట్లాడుతూ బాగా చదువుకోవాలని సూచించారు. పాఠశాలలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. రికార్డులను పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తున్నారు. ఈయనతో పాటు పాఠశాల సిబ్బంది ఉన్నారు.

ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

టయోటా గ్రామీణ మహోత్సవం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

టయోటా కార్లు అన్ని వర్గాల ప్రజలకు తక్కువ ధరకు అందిస్తూ నాణ్యతలో మంచి ప్రమాణాలను పాటిస్తున్నాయని ఎమ్మెల్యే గొండు శంకర్ పేర్కొన్నారు. మండలంలోని పెద్దపాడు రామిరెడ్డి వద్ద మోడీ టొయోటా గ్రామీణ మహోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన వాహనాలు రెండు రోజుల పాటు ప్రదర్శనలో ఉంచుతున్నారు. ప్రతిఒక్కరూ ఈ రెండు రోజుల అవకాశం పొంది వాహనాలను కొనుక్కోవాలన్నారు. మోడీ టయోటా జిఎం ఎస్.మురళీకృష్ణ మాట్లాడుతూ వాహనంపై సుమారు రెండు లక్షల వరకు తగ్గింపు ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో రవి, శివ, భాష, సర్పంచ్ గుండ భాస్కర్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శుల మండల అధ్యక్షునిగా బాలకృష్ణ

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపిడిఒ కె.ఫణీంద్ర కుమార్ సమక్షంలో జరిగిన కార్యదర్శుల కార్యవర్గ ఎన్నికకు సమావేశం నిర్వహించారు. ఈ ఎన్నికలో కార్యదర్శుల అధ్యక్షునిగా బి.బాలకృష్ణ, ఉపాధ్యక్షునిగా బి.సురేష్, జనరల్ సెక్రెటరీగా ఆర్.బాస్కర్, ట్రెజరర్‌గా ఆర్.రమేష్, ముఖ్య సలహాదారులుగా సిహెచ్.లప్పయ్య, గౌరవ అధ్యక్షులుగా చింతాడ సన్యాసితో పాటు పలువురును కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బాలకృష్ణ

భూ సమస్యలకు పరిష్కారం

లావేరు : వినతిపత్రం స్వీకరిస్తున్న తహశీల్దార్ జోగారావు

ప్రజాశక్తి- లావేరు

రెవెన్యూ సదస్సుల ద్వారా భూసమస్యలు పరిష్కరించుకొనేందుకు సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ ఎన్ని జోగారావు కోరారు. శుక్రవారం బుడుమూరులో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని రైతుల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, భూ యజమానులు భూములకు సంబంధించిన ఎటువంటి సమస్యలున్నా ధరఖాస్తులు చేసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పి.వెంకట్రాజు, సర్వేయర్ బళ్లాడ శ్రీధర్ రెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాపర్తి అప్పలరాజు, డిటి తిరుపతిరావు, మాజీ ఎంపిటిసి గోపాలరావు, నల్లి లక్కునాయుడు, రైతులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: భూ సమస్యలు పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ ఎన్.వెంకటరావు తెలిపారు. శుక్రవారం రత్తకన్నలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామస్తులు, రైతులు పలు రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఆమదాలవలస : మండలంలోని కొరపాం గ్రామ సచివాలయంలో సర్పంచ్ చేపేన సత్తిరాజు అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులను తహశీల్దార్ పి.రాంబాబు స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్ఐ పప్పల గోవిందరావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస : మాట్లాడుతున్న తహశీల్దార్ రాంబాబు

పొందూరు: మండలంలోని రాపాకలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహశీల్దార్ వెంకటేష్ రామానుజులు రైతుల నుంచి వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సిహెచ్ రామ్మోహన్, సర్పంచ్ ప్రతినిధి కొంచాడ గిరిబాబు, జిల్లా తెలుగుయువత ప్రధానకార్యదర్శి బలగ శంకర భాస్కర్, మండల తెలుగు యువత అధ్యక్షులు ఖండాపు శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.



S.No	Name of the candidate	Age	SEX	Address	Department	Sadarem ID	Previous Assessment and Disability	Present Assessment & Date & Disability	Remarks
1	Seepana Ananda Rao	59	Male	Kanugulavalasa Amadalavalasa Mdm	OPTHAL	[illegible]	27.08.2019 [illegible]	100 % Hundred Percent Blindness Progress	[illegible]

Superintendent
Govt. General Hospital
SRIKAKULAM-532 001

జిజిహెచ్ వైద్యులు జారీ చేసిన శత శాతం వికలాంగ ధ్రువపత్రం

కక్షతోనే పింఛను నిలుపుదల

ప్రజాశక్తి - ఆమదాలవలస

మండలంలోని కనుగులవలసకు చెందిన సీపాన ఆనందరావు గ్లకోమా వ్యాధితో విజువల్ ఫీల్డ్ అనాలిసిస్‌తో బాధపడుతున్నట్లు శత శాతం వికలాంగుడు అని జిజిహెచ్ వైద్య బృందం నిర్ధారిస్తే, అది నకిలీదని గ్రామానికి చెందిన టిడిపి మండల అధ్యక్షులు నూక రాజు తప్పుపట్టడం శోచనీయమని డిసిసిబి మాజీ డైరెక్టర్, వైసిపి నాయకులు బొడ్డేపల్లి నారాయణరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాధితునికి సంబంధించిన వికలాంగ ధ్రువపత్రాన్ని విడుదల చేశారు. ఆనందరావు వికలాంగుడు అని శ్రీకాకుళం జిజిహెచ్‌తో పాటు విశాఖ ప్రాంతీయ కంటి ఆస్పత్రి వైద్యులు నిర్ధారించడంతో కొన్నేళ్లుగా వికలాంగ పింఛను వస్తోందని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆనందరావుపై కక్షగట్టిన నూక రాజు పింఛన్‌ను నిలుపుదల చేయించారని తెలిపారు. పాత రోజుల నాటి ఒక ఫొటోను పత్రికలకు విడుదల చేసి ఆనందరావు వికలాంగుడు కాదని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దీనిపై ఇప్పటికే గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు బాధితుడు ఫిర్యాదు చేస్తే, వాస్తవాలు విచారించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారని తెలిపారు. దీంతో ఈ ఏడాది అక్టోబరులో జిజిహెచ్ వైద్య బృందం ఆనందరావు వికలాంగత్వాన్ని నిర్ధారించి ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసినా, పింఛన్ రాకుండా అడ్డుతగిలారని ఆరోపించారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి బాధితునికి న్యాయం చేయాలని కోరారు.

ఆర్చరీ పోటీలకు ఎంపికలు

శ్రీకాకుళం అర్బన్: రాజమండ్రిలో ఈనెల 23 నుంచి 25 వరకు జరగనున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ ఆర్చరీ పోటీల్లో పాల్గొనే జట్టు ఎంపిక ఈనెల 15న నగరంలో నిర్వహిస్తున్నట్టు ఆదిత్య ఆర్చరీ అకాడమీ జిల్లా కార్యదర్శి ఎల్.చిట్టిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. అరసవల్లిలో గల అకాడమీలో ఉదయం 10 గంటల నుంచి ఎంపికలు జరుగుతాయన్నారు. ఎంపికైన వారు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనడానికి అర్హత పొందుతారన్నారు. పోటీల్లో పాల్గొన దలచిన వారు నాలుగు పాస్‌ఫోటోలతో పాటు ఆధార్ కార్డు, డేట్ అఫ్ బర్త్ సర్టిఫికెట్, ఎంట్రీ ఫీజుతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 9440677201, 9989978727 నెంబర్లను సంప్రదించాలన్నారు.

'స్వర్ణాంధ్ర'లో ఉపాధి హామీ సిబ్బంది

కోటబొమ్మాళి: విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో శుక్రవారం జరిగిన స్వర్ణాంధ్ర 2027 విజన్ డాక్యుమెంట్ అవిష్కరణ కార్యక్రమంలో మండలానికి చెందిన ఉపాధిహామీ సిబ్బంది డివైఎస్ఒ మెట్ట రవి, ఎపిఒ కె.యుగంధర్, శ్రీనివాస్, సాంకేతిక సహాయకులు కె. వైకుంఠరావు, ఫీల్డు అసిస్టెంట్ బి.తేజేశ్వరరావులు పాల్గొన్నారు.

104 సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- పొందూరు

ప్రజల ఆరోగ్యరక్షణకు 24 గంటలు శ్రమిస్తున్న 104 సిబ్బందికి ఉద్యోగభద్రత కల్పించాలని కోరుతూ 104 సిబ్బంది మండలంలోని పెనుబర్తిలో ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు శుక్రవారం వినతిపత్రం అందించారు. నెలనెలా జీతాలు చెల్లించకపోవడంతో కుటుంబాలతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని వినతిపత్రంలో పేర్కొన్నారు. 104 సేవలను పిహెచ్‌సిల ద్వారా ప్రభుత్వమే నిర్వహించాలని, డిఎస్‌సి ద్వారా నియమితులైన డ్రైవర్లను కాంట్రాక్ట్‌లో కోరారు. వినతిపత్రం అందించిన వారిలో 104 సిబ్బంది ఐ.గోవిందరావు, పి.వాసుదేవరావు ఉన్నారు.

కోటబొమ్మాళి: పదహారేళ్లుగా ప్రజలకు సేవలందిస్తున్న 104 ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఎంపిడిఒ కుప్పిలి ఫణీంద్రకుమార్‌కు శుక్రవారం తన కార్యాలయంలో 104 సిబ్బంది వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అరబిందో యాజమాన్యంతో చర్చించి 104 సిబ్బందికి రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలన్నీ సత్వరం ఇప్పించాలన్నారు. 14 రోజులు నిరసన కార్యక్రమాలు చేపడతామని, అప్పటికీ మా సమస్యలు పరిష్కరించకుంటే అందోళన ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో 104 సిబ్బంది పాల్గొన్నారు.

పొందూరు : ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న 104 సిబ్బంది

సాగునీటి వ్యవస్థను సరిదిద్దండి

ప్రభుత్వ విప్ బెందాళం అశోక్

మాట్లాడుతున్న విప్ అశోక్

ప్రజాశక్తి- కవిటి

నియోజకవర్గంలోని సాగునీటి వ్యవస్థలో లోపాలు సరిదిద్ది సమయానికి రైతులకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అధికారులను ఆదేశించారు. రామయ్యపుట్టుగలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎన్ఆర్‌జిఎస్ సిబ్బందితో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోంపేట మండలం పైడిగాం ఛానల్ 69 చెరువులతో అనుసంధానం కలిగి ఉందని అయితే గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో వీటిలో పూడికలు పేరుకుపోయి సాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడినట్టు తెలిపారు. వీటిని వెంటనే సరిదిద్ది రైతులకు సకాలంలో సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదే విధంగా బుషికుడ్డ, బెంకిలి, కుత్తుమలో ఉన్న ఎత్తిపోతల పథకాలు సక్రమంగా పనిచేసేటట్టు పర్యవేక్షించాలని సూచించారు. ముఖ్యంగా నియోజకవర్గంలో ఉన్న 322 ఎంఐ, పిఆర్ ట్యాంకుల్లో లోపాలు సరిదిద్ది సక్రమంగా పనిచేసేలా చూడాలని ఆదేశించారు. సాగునీటి వ్యవస్థపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం పలు ఎన్ఆర్‌జిఎస్ పనుల అమలు తీరు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎపిడి శ్రీనివాసరెడ్డి, కవిటి, ఇచ్ఛాపురం, కంచిలి, సోంపేట ఎంపిడిఒలు శ్రీనివాస్ రెడ్డి, రామారావు, తిరుమలరావు, ఈశ్వరమ్మ, నాలుగు మండలాల ఎపిఒలు, ఎన్ఆర్‌జిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో రాణించాలి

ప్రజాశక్తి- కవిటి

జాతీయస్థాయి పోటీల్లో రాణించి ఉద్దానం ఖ్యాతి ఇనుమడింప చేయాలని సర్పంచుల సంఘం అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు, మండల విద్యాశాఖ అధికారి ధనుంజయ మజ్జి ఆకాంక్షించారు. ఇటీవల వమ్మరవెల్లిలో జరిగిన కళాఉత్సవ్ పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచిన కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు విజయవాడలో జరిగిన పోటీల్లో సత్తాచాటి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన పిబికె శర్మ, ఏకాంబరేశ్వర శర్మ, యు.గిరిబాబులను పాఠశాలలో ఆత్మీయ సత్కారం చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభకు కొదవలేదని, దానికి సానబడితే ఫలితం కచ్చితంగా వస్తుందన్నారు. జాతీయస్థాయిలో ఇదే స్ఫూర్తితో సత్తాచాటాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం బెందాళం మల్లేశ్వరరావు, లింగరాజు ప్రసాద్ పట్నాయక్, నాయకులు బెందాళం రమేష్, ఆరింగి మధుబాబు, పాండవ చంద్రశేఖర్, ఆరింగి త్రివిక్రమరావు, బెందాళం తిరుమలరావు, ఎస్ఎంసి చైర్మన్ తెప్పల మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఇఒ ధనుంజయ మజ్జి

పిఆర్‌సి కమిషన్ వేయాలి

ప్రజాశక్తి- పలాస

ప్రభుత్వం తక్షణమే పిఆర్‌సి కమిషన్ వేయాలని ఎపి నాన్ గజిటెడ్, గజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ పలాస అధ్యక్షులు బోనల గోపాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఎపి ఎన్‌జిఒ హోంలో ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారిధిగా ఉంటూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు పథకాలను చేరవేయడంలో ప్రధాన భూమిక పోషిస్తున్నారన్నారు. బకాయి ఉన్న జిపిఎఫ్ లోన్స్, జిఎల్‌ఐ, ఎరియర్స్ తక్షణమే విడుదల చేయాలని కోరారు. సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ కె.రవికుమార్, సబ్ ట్రెజరీ ఆఫీసర్ ఎల్.రామారావు, కార్యదర్శి బి.ఉపేందర్‌రావు, సభ్యులు పి.గిరి, దుర్గాప్రసాద్, పట్నాయక్, నీలాపు ఉపేంద్ర, ఎస్.పాపారావు, ఎల్.శ్రీనివాసరావు, త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గోపాల్

విశ్వేశ్వరనగర్‌లో విష సర్పాలు

భయాందోళనలో కాలనీవాసులు

కాలనీలో సంచరిస్తున్న విషసర్పాలు

ప్రజాశక్తి- పోలాకి

మండల కేంద్రం పోలాకి విశ్వేశ్వరనగర్‌లో విషసర్పాలు పట్టపగలే హల్‌చల్ చేస్తున్నాయి. ఈ కాలనీలో చాలా స్థలాలు నిరుపయోగంగా ఉండడంతో దట్టంగా ముళ్లపొదలు అలముకొని విషసర్పాలకు నెలవయ్యాయి. శుక్రవారం పట్టపగలే అంతా చూస్తుండగా భారీ సర్పాలు విన్యాసాలు చేస్తూ హల్‌చల్ చేశాయి. ఈ దృశ్యాన్ని చూసిన స్థానికులు భీతిల్లిపోయారు. అధికార యంత్రాంగం చొరవ తీసుకొని ముళ్లపొదలు తొలగించాలని, అదేవిధంగా వీధి దీపాలు అన్ని లైన్లలో వెలిగేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుచున్నారు. ఈ ప్రాంతంలో సుమారు డబ్బైకి పైచిలుకు కుటుంబాలతో పిల్లలు పెద్దలు అంతా కలసి రెండు వందల వరకు జనాభా ఉన్నారు. ముళ్లపొదలు, విషసర్పాల కారణంగా వీరంతా భయభ్రాంతులకు గురవుతున్నారు. అలాగే అటవీ శాఖాధికారులు స్పందించి వీటి నివారణకు చర్యలు చేపట్టి ప్రజలు సమస్యలు పరిష్కారం చేయాలని కోరుచున్నారు.

రక్తదానంపై అవగాహన పెంచుకోవాలి

రణస్థలం: రక్త దానంపై అవగాహన పెంచుకోవాలని ఎన్‌టిఆర్ ట్రస్ట్ వైద్యులు డాక్టర్ కె.సోమశేఖర్, రోటరీ క్లబ్ డాక్టర్ త్రిశాంక్ అన్నారు. అరబిందో ఫార్మా ఫౌండేషన్ సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎపిటోరియా ఫార్మాలో ఎన్‌టిఆర్ ట్రస్ట్, రోటరీ క్లబ్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానం చేసి ఇంకొకరికి ప్రాణదాతలు కావాలన్నారు. జిల్లాలో రక్తపు నిల్వలు చాల ప్రమాదకర స్థితిలో ఉన్నాయని, ఆ కొరతను అధిగమించడానికి ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయాలన్నారు. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ ఎన్.ప్రసాద్ మాట్లాడుతూ కొంతమందికి రక్తదానంపై అపోహలు ఉన్నాయని, ఇలాంటి రక్తదాన శిబిరాల వలన అపోహలు తొలగిపోతాయన్నారు. ఎపిటోరియా ఫార్మా హెచ్‌ఆర్ హెడ్ కె.కమలాకర్ రెడ్డి, పి.నారాయణరావు మాట్లాడుతూ ప్రతిఒక్క ఆరోగ్యవంతుడు రక్తదానం చేయడం వలన రక్తం శుద్ధి బాగా జరుగుతుందన్నారు. ఉద్యోగులు, కార్మికులు పాల్గొని సుమారు 178 యూనిట్ల రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఎపిటోరియా ఫార్మా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బురహన్ సయ్యద్ సమన్వయ కర్తగా వ్యవహరించారు.

రక్తదానం చేస్తున్న పరిశ్రమ ఉద్యోగులు

13 సంఘాలు కూటమి ఖాతాలోనే..?

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని 13 సాగునీటి సంఘాల్లోను కూటమి ఖాతాల్లోనే చేరినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఎచ్చెర్ల నియోజకవర్గం టిడిపి నాయకుడు ముప్పిడి సురేష్ అధ్యర్యంలో నాయకుల బృందం శుక్రవారం చర్చలు జరిపి అంతా ఎన్నికలు నిర్వహించకుండా పోటీ లేకుండా అంతా ఒక్కతాటిపైకి తీసుకువచ్చినట్టు తెలుస్తోంది. ఎక్కడ ఎవరు అధ్యక్షులు, ఉపాధ్యక్షులు అనే సర్దుబాటు కూడా జరిగిందని సమాచారం. వైసిపి ఎన్నికలను బహిష్కరించినట్లు వైసిపి అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రకటించినప్పటికీ రెండు రోజుల ముందుగానే సురేష్ ఏకగ్రీవానికి చక్కబెట్టడంతో వైసిపి నుంచి ఎవరు పోటీకీ కూడా సాహసం చేసే ప్రయత్నం చేయలేదు. దీంతో మండలంలోని 13 సాగునీటి సంఘాల్లోను ఎన్నికలు జరిగే పరిస్థితి లేదు.

వైద్యశిబిరానికి స్పందన

వజ్రపుకొత్తూరు: ప్రతీ ఒక్కరికీ నాణ్యమైన వైద్యసేవలు అందించాలని సర్పంచ్ గూడ గిరిజ ఈశ్వర్ అన్నారు. శుక్రవారం గరుడభద్రలో జెమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో సర్పంచ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడడానికి నాణ్యమైన వైద్య సౌకర్యాలు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలన్నారు. ఆరోగ్యంపై ప్రభుత్వ పరంగా అందుతున్న వైద్య సేవలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా సిబ్బంది రోగులకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కొంతమందిని మెరుగైన వైద్యం కోసం జెమ్స్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ అరుణ్ కుమార్, ఎ.వెంకటేష్, అనితా, ఎస్.భారతి, ఎస్.మోహన్, కె.మోహనరావు, టి.అప్పలస్వామి, అప్పారావు, ఈశ్వరరావు, ఆశా వర్కర్ చామంతి పాల్గొన్నారు.

ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

టెక్కలి: నీటి సంఘ ఎన్నికలు సజావుగా నిర్వహించేలా ఎన్నికల అధికారులు చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ సాదు దిలీప్ చక్రవర్తి కోరారు. నీటి సంఘ ఎన్నికల అధికారులతో శుక్రవారం కార్యాలయ ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ ఎన్నికలు జరగనున్న దృష్ట్యా సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు.

పోలాకి: మండలం పోలాకి, ఈదులవలస, డిఎల్ పురంలో పోలింగ్ కేంద్రాలను తహశీల్దార్ ఎం.సురేష్‌కుమార్, వంశధార డిఇ శ్రీహరి పరిశీలించారు. మౌలిక వసతుల కల్పన, ఏర్పాట్లును పరిశీలించారు. ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

గుర్తు తెలియని మహిళ మృతి

ప్రజాశక్తి- పొందూరు

పొందూరు-దూసి రైల్వేస్టేషన్ల మధ్య పెనుబర్తి సమీపంలో శుక్రవారం ప్రమాదవశాత్తు రైలు కిందపడి గుర్తుతెలియని మహిళ (60) మృతి చెందినట్లు జిఆర్‌పి ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు. మృతురాలు పొడవుగా, నలుపు రంగులో ఉండి ఎర్రని చీర ధరించినట్లు ఆయన తెలిపారు. మృతురాలి ఆచూకీ తెలిసిన వారు ఈ కింది ఫోన్ నెంబర్ 9490727521ను సంప్రదించాలని ఆయన కోరారు.

గంజాయితో పట్టుబడిన నిందితుడు

గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఒడిశా నుంచి అక్రమంగా ద్విచక్రవాహనంపై గంజాయి రవాణా చేస్తుండగా పురుషోత్తమపురం రైల్వేగేటు వద్ద ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ సిఐ పి.దుర్గాప్రసాద్ తెలిపారు. శుక్రవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒడిశా నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్న ఒడిశాకు చెందిన చందన కుమార్ మహంత్రి వద్ద నుంచి 18.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ జి వి.రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

కబేళాకు తరలిస్తున్న ఆవులు పట్టివేత

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘంలోని 1వ వార్డు పరిధిలోని పార్వతీశం పేట వద్ద అక్రమంగా కబేళాకు తరలిస్తున్న ఆవులను పట్టుకున్నట్లు ఎస్ఐ కె.వెంకటేష్ తెలిపారు. శుక్రవారం కొత్తూరు మండలంలోని బలద సంత నుంచి 34 ఆవులను అదే మండలానికి చెందిన నిచ్చెర్ల మల్లేష్, కుప్ప త్రినాథ్, షణ్ముఖరావు, కడుము గ్రామానికి చెందిన శంకర్ తోలుకొని తీసుకు వస్తుండగా పార్వతీశం పేట వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. మొత్తం ఐదుగురుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. స్వాధీనం చేసుకున్న 34 ఆవులను విజయనగరం జిల్లా గుర్లలోని గోశాలకు తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో పశు సంవర్ధక శాఖ ఎడి రోణంకి ఆనందరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తకాలు అందజేస్తున్న పిఒ విమలారాణి

అంగన్వాడీలకు పుస్తకాలు

ప్రజాశక్తి- పాతపట్నం

పాతపట్నం ఐసిడిఎస్ ప్రాజెక్ట్‌లో పాతపట్నం-1, పాతపట్నం-2 అంగన్వాడీ కేంద్రాల్లో శుక్రవారం ఐసిడిఎస్ పిఒ టి.విమలారాణి ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ కేంద్రాల్లో గర్భిణులకు, చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతో పాటు పిల్లలకు మెరుగైన విద్యాబోధన అందించాలన్నారు. సూపర్‌వైజర్ అనురాధ, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న నాయకులు

సిసి రోడ్డు పనులకు భూమి పూజ

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండలం నౌపడ పంచాయతీలోని పలు వీధుల్లో సిసి రోడ్ల నిర్మాణానికి టిడిపి నాయకులు సుగుశాంతి స్వరూప్ రెడ్డి శుక్రవారం భూమి పూజ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక పంచాయతీల్లోని పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని స్వరూప్ రెడ్డి అన్నారు. గ్రామస్తుల సహకారంతో శరవేగంగా అభివృద్ధి పనులు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో సచివాలయాధికారి అనంత్, ఎస్ఎంసి చైర్మన్లు గిరిబాబు, కామరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నవ వధువుకు ఆర్థికసాయం అందజేస్తున్న దిలీప్‌కుమార్

నిరుపేద వివాహానికి సాయం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మున్సిపల్ ఎన్నికల సమయంలో తన వార్డులో నిరుపేద కుటుంబంలో అమ్మాయి వివాహానికి తనవంతు ఆర్థికసాయం రూ.15 వేలు వరకు అందిస్తానని ఇచ్చిన మాటకు కట్టుబడిన వార్డు టిడిపి కౌన్సిలర్ కాళ్ల దిలీప్ కుమార్ యాదవ్ శుక్రవారం రూ.15 వేలు ఆర్థికసాయం అందించి మాట నిలబెట్టుకున్నారు. 22వ వార్డులో ఉంటున్న పొట్లంక శ్రీను తన కుమార్తె వివాహం జరిపించారు. ఈ సందర్భంగా విషయం తెలుసుకున్న వార్డు కౌన్సిలర్ దిలీప్ కుమార్ స్వయంగా వెళ్లి నవ వధువు మహాలక్ష్మిని ఆశీర్వదించి రూ.15 వేలు అందించారు. కార్యక్రమంలో కాళ్ల కృష్ణ, దేవ్ ఉన్నారు.

రజక కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- పొందూరు

మండలం పిల్లవలసలో ఇబ్బందుల్లో ఉన్న రజక కుటుంబాన్ని గ్రామస్తులు ఆర్థికంగా ఆదుకున్నారు. 20 ఏళ్ళుగా గ్రామంలో నమ్మకంగా కులవృత్తి చేసుకుంటున్న దాలినాయుడు ఇటీవల కిడ్నీవ్యాధికి గురికావడంతో పాటు కుమార్తె వివాహం కుదరడంతో ఆర్థిక ఇబ్బందులు నెలకున్నాయి. దీంతో దాలి నాయుడు పరిస్థితి సర్పంచ్ బుడుమూరు పోలి నాయుడు దృష్టికి వెళ్లడంతో ఆర్థికంగా ఆదుకోవాలని పిలుపునిచ్చారు. దీంతో గ్రామంలో యువకులు, పెద్దలు కలిసి రూ.60 వేలు పోగుచేసారు. ఈ నగదును శుక్రవారం దాలినాయుడుకు అందించారు. దీంతో సర్పంచ్‌కు, గ్రామస్తులకు దాలినాయుడు కృతజ్ఞతలు తెలిపారు.

పట్టుపురం, మందస రహదారిలో రోడ్డును కప్పేసిన మంచు

మంచు దుప్పటి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

శీతాకాలం రావడంతో మంచు ఎక్కువగా కురుస్తుండడంతో ఉదయం సమయంలో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. మంచు పడే సమయంలో రహదారి కనిపించకపోవడంతో వాహనదారులు లైట్లు వేసి ప్రయాణిస్తున్నారు. గత రెండు రోజులుగా మండలంలోని పలు ప్రాంతాల్లో మంచు తీవ్రత ఎక్కువగా ఉంది.

నేటి నుంచి

ఇంధన పొదుపు వారోత్సవాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు జిల్లాలో విద్యుత్ శాఖ ఆధ్వర్యాన జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ నాగిరెడ్డి కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా విద్యుత్ పొదుపు అవగాహనా ర్యాలీలు జిల్లా, డివిజన్ కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ పొదుపుపై జిల్లావ్యాప్తంగా పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విజేతలకు ఈనెల 20వ తేదీన బహుమతులను ప్రదానం చేస్తామని తెలిపారు. స్వయం సహాయక సంఘాల బృందాలతో ముగ్గుల పోటీలు నిర్వహించి, వారికి ఇంధన సంరక్షణ పద్ధతులు, స్టార్ రేటెడ్ గృహోపకరణాల ప్రయోజనాలపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. 'విద్యుత్ పొదుపు ఆవశ్యకత - నూతన సాంకేతిక విజ్ఞానం' అనే అంశంపై నిష్ణాతులతో ఇంజినీరింగ్ కళాశాలల్లో వర్క్‌షాపులు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యుత్ పొదుపు ఆవశ్యకత గురించి వినియోగదారులతో అన్ని విద్యుత్ కార్యాలయాల్లో అవగాహనా సదస్సులు, గ్రామీణ ప్రాంతాల్లో జానపద కళాకారులు, జన విజ్ఞాన వేదిక కార్యకర్తలతో ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న గొయ్యి

ఆదమరిస్తే ఆపదే...

పాలకొండ: పట్టణంలో జగనన్న కాలనీకి వెళ్లే రహదారిలో లంబూరుకు వెళ్లే రోడ్డుకు పెద్ద గుంత పడింది. రోడ్డు మలుపులో గుంత ఉండడం, రాత్రి సమయంలో ఇక్కడ వీధి దీపాలు లేకపోవడంతో ఇక్కడ ప్రమాదాలు జరిగే ఆస్కారం ఎక్కువగా ఉంది. నిత్యం వందలాది వాహనాలు ప్రయాణించే ఈ రోడ్డులో ఈ గుంత దగ్గర ఆదమరిస్తే ప్రమాదం జరగడం ఖాయం. అధికారులు ఈ సమస్యను గుర్తించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మిల్లర్ల దోపిడీని అరికట్టాలి

పాలకొండ: రైస్ మిల్లర్ల దోపిడీ అరికట్టాలని ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నాయకులు స్థానిక సబ్ కలెక్టర్ యశ్వంత్ కుమార్‌రెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. మిల్లర్లు సిండికేట్‌గా మారి, క్వింటాకు అదనంగా ఐదు కేజీల ధాన్యం రైతుల వద్ద తీసుకుంటున్నారని, ఈ దోపిడీని అరికట్టాలని కోరారు. స్పందించిన సబ్ కలెక్టర్ దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బుడితి అప్పలనాయుడు, తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

సమాజంలో రోజురోజుకు జరుగుతున్న కొత్తకొత్త సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని రూరల్ ఎస్ఐ శ్రీనివాస్ అన్నారు. మండలంలో కొలిగాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అవగాహన కల్పించారు. ఈ అవగాహన కార్యక్రమానికి హెచ్ఎం నరేంద్రనాథ్ పట్నాయక్ అధ్యక్షత వహించారధీ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సైబర్ నేరాలు, ఇతర మోసాలపై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ఫలితాలను వివరించారు. కార్యక్రమంలో సిఆర్‌పిఎ ఎస్ఐ రాజకుమార్ , టిడిపి నాయకులు లోపింటి పద్మనాభం, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శ్రీనివాస్

రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన అన్నదానం

అన్నసంతర్పణ చేస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

ప్రజాశక్తి- శ్రీకాకుళ: అర్బన్

రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన కాశీ అన్నపూర్ణేశ్వరి అన్నదాన పథకం పేరిట నిత్యాన్నదాన పథకాన్ని ప్రారంభించినట్టు ఛైర్మన్ పి.జగన్ మోహనరావు తెలిపారు. కళ్యాణ్ అనురాగ నిలయం, సివి నాగజ్యోతి ఆనంద నిలయం, దుర్గాదేవి చారిటబుల్ ట్రస్ట్, వరసిద్ధి వినాయక ఆలయం సంయుక్తంగా ప్రతిరోజూ డేఅండ్ నైట్‌తో పాటు, పలు ఆలయాల వద్ద ఉండే యాచకులు, పేదలకు అన్నదానం అందిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి దాతలు సహకారాన్ని అందిస్తున్నారని వివరించారు. శుక్రవారం పెద్దపాడుకు చెందిన సాయి పుట్టిన రోజు సందర్భంగా ఈపథకం ద్వారా అన్నదానం నిర్వహించారని తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధులు, సాయికుమార్ స్నేహితులు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో సిఎం చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యమని కల్లేపల్లి గ్రామస్తులు అన్నారు. నగరంలోని విశాఖ ఎ కాలనీలో ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే శంకర్ సమక్షంలో టిడిపిలో శుక్రవారం చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి టిడిపి కండువాలను వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్లినా ప్రజల నుంచి కూటమి ప్రభుత్వానికి ఆదరణ లభిస్తుందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మూకల్ల శ్రీను, జయానంద్, శీర రమణయ్య, మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే శంకర్

పిహెచ్‌సిల్లో డిపిఒ తనిఖీలు

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని కుసిమి, ధోనుబాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్‌మోహనరావు శుక్రవారం తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు నమోదు పరిశీలించి అందరూ పిహెచ్‌సి విధుల్లో ఉన్నారా అని ఆరా తీశారు. పిహెచ్‌సిలో వైద్య సేవలందుతున్న తీరును ఆయా విభాగాల వారీగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ల్యాబ్‌లో వైద్య పరికరాల పనితీరు గమనించారు. రక్త, మూత్ర పరీక్షల నివేదికలు సకాలంలో తెలియజేస్తున్నారా అని పరీక్షించిన అనంతరం నివేదించిన తారీఖులను పరిశీలించారు. పరికరాల్లో సాంకేతిక లోపాలు తలెత్తకుండా సక్రమంగా ఉపయోగించి జాగ్రత్త పర్చాలన్నారు. సాధారణ ప్రసవాలు నిర్వహించడానికి అవసరమైన వైద్య పరికరాలు, ఇంజక్షన్లు, మౌలిక సదుపాయాల లభ్యత పరిశీలించారు. కాన్పుల రికార్డులు పరిశీలించి పిహెచ్‌సిల్లో ప్రసవాల సంఖ్య మెరుగుపడాలని ఆదేశించారు. అందుకు కార్యాచరణ ఏ విధంగా చేపడతారని సుపర్వైజర్లను ఆరా తీశారు. మందుల నిల్వలు, వినియోగం రికార్డులు సక్రమంగా నిర్వహిస్తున్నారా, వాటి కాలపరిమితి తనిఖీ చేశారు. కుక్క, పాముకాటులకు మందుల లభ్యతను పరిశీలించారు. అనంతరం ఆసుపత్రి ఆవరణ పరిశీలించారు. బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ సక్రమంగా అమలు జరిగేలా చూడాలన్నారు. సాయంత్రం, రాత్రి వేళల్లో షిఫ్ట్ డ్యూటీ సిబ్బంది పిహెచ్‌సి అందుబాటులో ఉంటున్నారా అని, పర్యవేక్షించాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఆరోగ్య పర్యవేక్షకులు ప్రతిరోజూ క్షేత్ర స్థాయిలో సందర్శించి ఆరోగ్య కార్యక్రమాలు సక్రమంగా అమలు జరిగేలా చూడాలని, టూర్ డైరీ సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. సందర్శన (మూమెంట్)రిజిస్టర్ తనిఖీ చేశారు. ఆసుపత్రుల్లో సిబ్బంది అందుబాటులో ఉంటూ రోగులకు జాప్యం లేకుండా సకాలంలో వైద్యం అందించాలన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు సిహెచ్.చాందిని, వి.శివశంకర్, రత్నం ఆరోగ్య కార్యాలయ డెమో యోగీశ్వరరెడ్డి,సూపర్వైజర్ జయగౌడ్, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న జగన్మోహనరావు

వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

జర్నలిస్టులపై దాడులను అరికట్టాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

తెలుగు రాష్ట్రాల్లో జర్నలిస్టులపై దాడులను నిరసిస్తూ జర్నలిస్టు సంఘాల నాయకులు శుక్రవారం కలెక్టరేట్‌లో జెసి ఫర్మాన్ అహ్మద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని వారు కోరారు. దాడులకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో వివిధ పత్రికల జర్నలిస్టులతో పాటు మీడియా ప్రతినిధులు బాలు, సునీల్, నారాయణరావు, రాజు, అప్పలనాయుడు, రామకృష్ణ, వాసు, రాజేష్, ప్రవీణ్, సూరిబాబు, లక్ష్మణరావు, నిరంజన్, రాము, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

అల్పాహారాన్ని అందజేస్తున్న శ్యామసుందర్

అల్పాహారం వితరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సామాజిక బాధ్యతతో తన తండ్రి భైరి వర ప్రసాదరావు ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని నగరంలోని బెహరా మనో వికాస కేంద్రంలో భైరి శ్యామ్ సుందర్ ఆధ్వర్యాన అల్పాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రిని స్మరించుకుంటూ మానసిక వికలాంగులు, పిల్లల మధ్య జరుపుకోవటం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో కుటుంబసభ్యులు జ్యోతి, రాజు మోహన్, విజయ్ ప్రసాద్, జ్యోతి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి- లావేరు

టిడిపితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని మాజీ జెడ్‌పిటిసి రాజాపంతుల ప్రకాశరావు అన్నారు. శుక్రవారం కేశవరాయనిపాళెంలో టిడిపి సభ్యత్వనమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి కార్యకర్తలకు అండగా ఉంటుందని వారి సంక్షేమం కోసం పార్టీ బీమా తదితర విషయాలపై ఆలోచన చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు నాయన లక్మణరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలో ఈదుపురంలో శుక్రవారం ఒడియా బాప్టిస్టు మందిరంలో క్రిస్మస్ సంబరాలు ఘనంగా నిర్వహించారు. బిమ్మా బెహరా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షులు ప్రత్తి అన్వేష్ హాజరై 35 మంది పాస్టర్లకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాస్టర్ డి.ఎలియా, సుందర్ రాజ తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ సంబరాల్లో అన్వేష్